ఇక్కడ నో రూల్స్.. నో అబ్జెక్షన్

దుర్గంలో యథేచ్ఛగా అక్రమ కట్టడాలు

- టీడీపీ అస్మదీయులైతే చాలు కట్టేయడమే
- మున్సిపాలిటీ స్థలంలో రాత్రికి రాత్రే వెలసిన బంకులు
- భవనాలు కోల్పోయిన వారికి హైకోర్టు ఆదేశాలున్నా పట్టించుకోని వైనం

కళ్యాణదుర్గం: కళ్యాణదుర్గంలో యథేచ్ఛగా అక్రమంగా నిర్మాణాలు వెలుస్తున్నాయి. టీడీపీ స్థానిక ఎమ్మెల్యేకు అస్మదీయులైతే చాలు.. మున్సిపాలిటీలో రూల్స్ ఉండవు...అబ్జెక్షన్లూ ఉండవు. మున్సిపాలిటీ ఖాళీ స్థలంలో రాత్రికి రాత్రే అనుకున్నదే తడువుగా అక్రమ కట్టడాలు వెలుస్తున్నాయి. ఇదంతా సదరు మున్సిపల్ అధికారుల కనుసన్నల్లో జరుగుతున్నా తమకేమీ పట్టనట్లు వ్యవహరించడం విమర్శలకు తావిస్తోంది. కళ్యాణదుర్గం మున్సిపాలిటీ పరిధిలో ఖాళీ స్థలం కనిపిస్తే చాలు అక్రమ కట్టడాలు రాత్రికి రాత్రే వెలుస్తున్నాయి. స్థానిక టీడీపీ నేతలే స్వయంగా అభయమిస్తూ ఖాళీ స్థలాలను కబ్జా చేయిస్తున్నారు. మున్సిపల్ నిబంధనలకు విరుద్ధంగా అక్రమ కట్టడాలను కట్టేస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. అక్రమ కట్టడాలను ప్రశ్నించే వారు లేకపోవడంతో ఖాళీ స్థలాలను కబ్జా చేస్తున్నారు. ముఖ్యంగా కళ్యాణదుర్గంలోని గాంధీచౌక్, బళ్లారి మిట్ట నుంచి ఆర్డీటీ ఆసుపత్రికి వెళ్లే రహదారి ఇరువైపులా, లక్ష్మీదేవమ్మ విగ్రహం నుంచి కళాశాలకు వెళ్లే ప్రధాన రహదారులను కొందరు స్వార్థపరులు ఆక్రమించుకుని అక్రమంగా నిర్మాణాలు చేపట్టారు.

హైకోర్టు ఆదేశాలున్నా పట్టించుకోని వైనం..

గతంలో కళ్యాణదుర్గంలో రహదారుల విస్తరణలో భాగంగా 38 మంది భవన యజమానులు తమ భవనాలను కోల్పోయారు. అయితే కొందరు తమకు మున్సిపాలిటీ స్థలాల్లో ఎక్కడైనా స్థలం కేటాయించాలని హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు సైతం పలువురికి ఖాళీ స్థలాలను కేటాయించాలని మున్సిపల్ అధికారులకు ఆదేశాలు ఇచ్చింది. అయితే సదరు ఉత్తర్వులున్న వారిని కనీసం పరిగణలోకి తీసుకోకుండా వారి ఫిర్యాదులను కూడా మున్సిపల్ అధికారులు బుట్టదాఖలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఖాళీగా ఉన్న స్థలాల్లో బాధితులకు కాకుండా టీడీపీ నాయకులు చూపించిన వారికే వత్తాసు పలుకుతూ మున్సిపల్ అధికారులు ఖాళీ స్థలాలను కేటాయించారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



గాంధీ చౌక్ వద్ద మున్సిపల్ స్థలంలో టీడీపీ కార్యకర్తలు వేసుకున్న బంకులు

కౌన్సిల్ ఆమోదం లేకుండానే స్థలం కేటాయింపు..

వాస్తవానికి మున్సిపాలిటీలో ఏ చిన్న పని చేయాలన్నా కౌన్సిల్ ఆమోదం తప్పనిసరి. మున్సిపల్ చైర్మన్‌తో పాటు కౌన్సిలర్లు, కమిషనర్ కౌన్సిల్ ఆమోదంతోనే పనులు జరుగుతాయి. అలాంటిది మున్సిపాలిటీ పరిధిలో ఖాళీగా ఉన్న స్థలాలను కబ్జా చేయడంలో టీడీపీ నేతలదే పైచేయిగా ఉంటోంది. స్థానిక నేతలు మున్సిపల్ కౌన్సిల్ ఆమోదం తెలపకుండానే ఖాళీగా ఉన్న చోట్ల రాత్రికి రాత్రే కట్టడాలు చేపట్టి కబ్జాకు తెర లేపుతున్నారు. కళ్యాణదుర్గాన్ని అభివృద్ధి చేస్తామని గొప్పలు చెప్పిన టీడీపీ ఎమ్మెల్యే.. అధికారం రాగానే కబ్జాల పర్వానికి తెర లేపుతున్నారని పలువురు ప్రజలు ఆరోపిస్తున్నారు.

అక్రమ కట్టడాలపై నిఘా

గాంధీ చౌక్‌లో మున్సిపాలిటీ స్థలంలో అక్రమంగా నిర్మిస్తున్న కట్టడాలను ఆపాలని ఆదేశాలు ఇచ్చాం. మున్సిపల్ స్థలంలో అనుమతులు లేకుండా కట్టడాలు నిర్మించినా చర్యలు తీసుకుంటాం. కౌన్సిల్ ఆమోదంతోనే ఏవైనా కట్టడాలు చేపట్టేందుకు అనుమతులు ఉంటాయి. అక్రమ కట్టడాలపై ప్రత్యేక నిఘా ఉంచుతాం.

– వంశీకృష్ణ భార్గవ్,
మున్సిపల్ కమిషనర్, కళ్యాణదుర్గం

క్లుప్తంగా

ఆర్డీటీ ఎఫ్‌సీఆర్‌ఏ రెన్యూవల్ చేయాలని వినతి



పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం సమర్పిస్తున్న యర్రగుంట ప్రజలు

కణేకల్లు: ఆర్డీటీపై పెట్టిన ఆంక్షలను ఎత్తేసి ఎఫ్‌సీఆర్‌ఏ రెన్యూవల్ చేయాలని యర్రగుంట గ్రామస్తులు కోరారు. సర్పంచు దంపతులు వన్నూరమ్మ, హనుమంతప్ప ఆధ్వర్యంలో గ్రామస్తులు ర్యాలీ చేశారు. వారు మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల నుంచి ఆర్డీటీ విద్య, వైద్య సేవలను పేదలకు అందిస్తోందన్నారు. పేదలకు అండగా ఉంటున్న ఆర్డీటీపై ఆంక్షలు పెడితే ప్రజలు నష్టపోతారన్నారు. అనంతరం పంచాయతీ కార్యదర్శి గంగాధర్‌కు వినతి పత్రాన్ని సమర్పించారు.

ప్రైవేట్ స్కూళ్లపై చర్యలు తీసుకోవాలని ధర్నా



ఫీజుల దోపిడీపై ధర్నా చేస్తున్న ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు

ఉరవకొండ: నిబంధనలకు విరుద్ధంగా డొనేషన్లు, ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్ల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని ఎస్సీ,ఎస్టీ ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో సోమవారం ధర్నా చేశారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిర్వహించిన ధర్నాలో ఆలిండియా ఎస్సీ, ఎస్టీ ఐక్యవేదిక విద్యార్థి సంఘం నాయకులు సాకే పురుషోత్తం, రాజశేఖర్, ధనంజయ మాట్లాడుతూ ఉరవకొండలోని ప్రైవేట్ స్కూళ్లలో ఇప్పటికే డొనేషన్లు వసూలు చేస్తూ ఎల్‌కేజీ నుంచి పదో తరగతి వరకు రూ.వేలు వసూలు చేస్తున్నాయన్నాయన్నారు. పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు విక్రయిస్తూ, సామాన్య, మధ్య తరగతి తల్లిదండ్రుల నడ్డి విరుస్తున్నట్లు తెలిపారు. అనంతరం తహసీల్దార్ మహబూబ్‌బాషాకు వినతి పత్రం అందించారు.

ఎస్ఎస్ ట్యాంకు పరిశీలన



కణేకల్లు ఎస్ఎస్ ట్యాంకు పంపింగ్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్, అధికారులు

రాయదుర్గంటౌన్: పట్టణానికి మంచి నీటి సరఫరా చేసే డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హెచ్చెల్సీ తాగునీటి పథకం కింద కణేకల్లులోని సమ్మర్ స్టోరేజీ ట్యాంకును మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి, ఇంజనీరింగ్ అధికారులు సోమవారం పరిశీలించారు. వీరాపురం వద్ద నున్న పంపింగ్ స్టేషన్‌తోపాటు ఎస్ఎస్ ట్యాంకు, రా వాటర్ పంపింగ్‌ను పరిశీలించారు. మోటార్ రన్నింగ్ సిస్టంను తనిఖీ చేసి, రానున్న జూలైలో హెచ్చెల్సీ కాలువ నుంచి నీటి పంపింగ్ జరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో క్షేత్రస్థాయిలో టెక్నికల్ సమస్యలన్నింటినీ సరి చేసే సిద్ధం చేయాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో డీఈ సురేష్, ఏఈ నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

అవినీతి అధికారులను సస్పెండ్ చేయాలి



మున్సిపల్ కమిషనర్ వంశీకి వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

కళ్యాణదుర్గం రూరల్: అవినీతి, అక్రమాలకు పాల్పడిన శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆలీఖాన్, హెల్త్ అసిస్టెంట్ తిప్పేస్వామిపై చర్యలు తీసుకోవాలని పారిశుధ్య కార్మికులు, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అచ్యుత్ డిమాండ్ చేశారు. సోమవారం మున్సిపాల్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ వంశీకి వినతిపత్రం అందించారు. కార్మికులు మాట్లాడుతూ పారిశుధ్య కార్మికుల జీతాల కోసం శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆలీఖాన్, హెల్త్ అసిస్టెంట్ తిప్పేస్వామి రూ. 5వేలు వసూలు చేశారు. గతంలో 13 మంది కార్మికుల వేతనాల్లో వేలాది రూపాయలు కట్ చేసి, దోచేశారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ కార్యదర్శి మన్నూరస్వామి, నాయకులు నట్రాజ్, శివ, వెంకటేష్, శివయ్య, లలితమ్మ పాల్గొన్నారు.

షాపు రూముల వేలం వాయిదా

రాయదుర్గంటౌన్: మున్సిపల్ కూరగాయల షాపింగ్ కాంప్లెక్స్‌లోని ఏ, బీ, సీ బ్లాక్‌లలో ఖాళీగా ఉన్న ఆరు షాపుల రూములకు సోమవారం నిర్వహించిన వేలం పాట వాయిదా పడింది. రూ.2 లక్షల నాన్ రిఫండబుల్ గుడ్‌విల్ ప్రాతిపదికన నిర్వహించిన వేలంలో పాటదారులు ఎవరూ పాల్గొనలేదు. దీంతో వేలం పాటను వాయిదా వేస్తున్నట్లు కమిషనర్ దివాకర్‌రెడ్డి తెలిపారు. కాంప్లెక్స్‌లో పై అంతస్తులోని రూములతో పాటు వాయిదా పడిన రూములకు కూడా త్వరలో వేలం పాట నిర్వహించనున్నట్లు చెప్పారు.

ప్రజల తరఫున సమష్టిగా పోరాటాలు చేద్దాం

- మాజీ ఎమ్మెల్యే, రాయదుర్గం సమన్వయకర్త మెట్టు



మైనార్టీ నాయకుడు రహంతుల్లాను పరామర్శిస్తున్న మెట్టు

డి హీరేహాళ్(రాయదుర్గం): ప్రజల తరఫున సమష్టిగా పోరాటాలు చేద్దామని నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మెట్టు గోవిందరెడ్డి అన్నారు. సోమవారం డీ హీరేహాళ్ మండల కేంద్రంలోని పార్టీ నాయకులతో కలసి పర్యటించారు. జెడ్పీటీసీ హసీనబాను మామ, మైనార్టీ నాయకుడు రహంతుల్లా కంటి ఆపరేషన్ చేయించుకోవడంతో పరామర్శించారు. ఆరోగ్య క్షేమాన్ని అడిగి తెలుసుకున్నారు. అనంతరం అక్కడే పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం సూపర్‌సిక్స్ హామీల అమలులో ఘోరంగా విఫలమైందని, ప్రజలు నిలదీసే పరిస్థితి వచ్చిందన్నారు. తల్లికి వందనం అమలుపై సర్కార్ గొప్పలు పోతున్నా, క్షేత్రస్థాయిలో దాని ప్రభావం ప్రజల్లో పెద్దగా కనిపించలేదన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రజలకు మనమంతా మద్దతుగా నిలుద్దామన్నారు. భవిష్యత్తు వైఎస్సార్‌సీపీదేనని గుర్తుచేశారు. ఏడాది కూటమి పాలనపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత కనిపిస్తోందన్నారు. సమస్య ఏదైనా ధైర్యంగా కలసికట్టుగా ముందుకు కదలాలన్నారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రవీంద్రనాథ్‌రెడ్డి, బీసీసెల్ అధ్యక్షుడు తొండ వెంకటేశులు, సోములాపురం సర్పంచ్ సుదర్శనరెడ్డి, అంజిరెడ్డి, సందీప్‌పాటిల్ పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాలకు రోడ్డు నిర్మించండి



తహసీల్దార్ నరేష్‌కుమార్‌కు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

వజ్రకరూరు: స్థానిక ఆదర్శ పాఠశాలకు రోడ్డు సౌకర్యం కల్పించాలని మాలమహానాడు నాయకులు, గ్రామస్తులు కోరారు. సోమవారం మండల కేంద్రంలో మహామహానాడు ఆధ్వర్యంలో తహసీల్దార్ నరేష్‌కుమార్‌ను కలిసి వినతిప్రతం అందించారు. మాలమహానాడు నాయకులు, గ్రామస్తులు మాట్లాడుతూ 2013లో ఆదర్శ పాఠశాల ఏర్పాటైందని, సుమారు 600 మంది దాకా విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారన్నారు. పాఠశాలకు వెళ్లే దారి సరిగాలేదన్నారు. ఈకార్యక్రమంలో మహా మహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు మొలకబాల రామాంజనేయులు, ఆదర్శ పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ హిదాయతుల్లా పాల్గొన్నారు.

‘యువత పోరు’కు తరలిన కుందుర్పి నాయకులు

కుందుర్పి: జిల్లా కేంద్రంలో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన యువత పోరు కార్యక్రమానికి మండలం నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు సోమవారం పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. ఎంపీపీ కమలమ్మ, మాజీ వాల్మీకి డైరెక్టర్ పాలాక్షి, భీమప్ప, ఎస్సీసెల్ డివిజన్ అధ్యక్షుడు తిప్పేస్వామి, సర్పంచులు వెంకటేశులు, రామూర్తి, నరేష్, అతావుల్లా, వార్డు సభ్యులు మంజు, గంగాధర, మాజీ మార్కెట్ యార్డు మెంబర్ లింగప్ప తదితరులు ఉన్నారు.

పారిశుధ్య కార్మికుల పేరిట డబ్బు వసూలుకు యత్నం



దుకాణ యజమానిని డబ్బు డిమాండ్ చేస్తున్న గుర్తు తెలియని వ్యక్తి

రాయదుర్గంటౌన్: మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు టీ ఇప్పించాలి.. డబ్బులు ఇవ్వాలని గుర్తు తెలియని ఓ గుర్తు తెలియని వ్యక్తి దుకాణ యజమానులను డిమాండ్ చేసిన ఘటన సోమవారం వెలుగుచూసింది. ఉదయం పట్టణంలోని కణేకల్లు రోడ్డులో ఓ షాపు యజమాని వద్దకు ద్విచక్ర వాహనంపై ఓ వ్యక్తి వచ్చి ఈ రోడ్డులో కార్మికులు పనిచేస్తున్నారు.. వారిని తానే పంపించా.. టీ తాగేందుకు డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనుమానం వచ్చిన షాపు యజమాని అతని సంభాషణలు వీడియో తీసి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవీంద్రయాదవ్‌కు పంపించాడు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ మున్సిపల్ సిబ్బంది ఎవరితోనూ డబ్బులు అడగరని, అనుమానాస్పద వ్యక్తులు ఇలా డబ్బు అడిగితే పోలీసులు, మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేయాలని తెలియజేశాడు.


త్రుటిలో తప్పిన పెను ప్రమాదం

రాయదుర్గంటౌన్: పట్టణంలోని డాక్టర్ రాధాకృష్ణ మున్సిపల్ హైస్కూల్ వద్ద సోమవారం మధ్యాహ్నం విద్యుత్ స్తంభం విరిగిపడింది. అయితే ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. చెట్టుకొమ్మ తెగి తీగలపై పడగా, ఏకంగా విద్యుత్ స్తంభం విరిగి కింద వాలింది. దీంతో విద్యుత్ తీగల చెల్లాచెదరయ్యాయి. ఇక్కడే మున్సిపల్ పాఠశాల, ప్రైవేట్ పాఠశాల ఉన్నాయి. ఈ ఘటన జరిగిన సమయంలో విద్యార్థులు ఎవరూ లేకపోవంతో పెద్ద ప్రమాదమే తప్పింది. గతంలో పలుమార్లు స్థానికులు విద్యుత్ స్తంభం, తీగల గాలి వేగానికి ఊగుతున్నట్లు ఫిర్యాదు చేస్తున్నా విద్యుత్ శాఖ అధికారులు పట్టించుకోలేదన్నారు. క్షేత్రస్థాయిలో సిబ్బంది అక్కడికి చేరుకుని మరమ్మతు పనులు చేపట్టారు.



నేలకూలిన విద్యుత్ స్తంభం

జరుట్లరామలింగేశ్వరుడికి అభిషేకాలు



జరుట్ల నగరేశ్వరస్వామి

వజ్రకరూరు: జరుట్లరాంపురం గ్రామంలో సోమవారం ప్రముఖ పుణ్యక్షేత్రం జరుట్లరామలింగేశ్వర స్వామి ఆలయంలో స్వామికి అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, రుద్రాభిషేకం, మహా మంగళహారతి తదితర పూజలు చేశారు. సాయంత్రం కూడా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. నగరేశ్వర స్వామి, భోగే శ్వర స్వామి, రామేశ్వరస్వామి ఆలయాల్లోనూ ప్రత్యేక పూజలు చేశారు.

సర్వేయర్ల సమస్యలు పరిష్కరించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న సచివాలయ సర్వేయర్లు

బొమ్మనహాళ్: విలేజ్ సర్వేయర్ల సమస్యలు పరిష్కరించాలని తహసీల్దార్ మునివేలుకు సోమవారం వినతిపత్రం అందించారు. సర్వేయర్లు నాగరాజు, ఎర్రిస్వామి, మనోజ్‌కుమార్, అరివింద, సంపత్‌కుమార్, శంకర్ నాయక్, ఆనంద్ నాయక్, భావని, హనుమంతు, బసవరాజు తదితరులు మాట్లాడారు. సర్వేయర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ఉన్నతాధికారులకు విన్నవించినా ఫలితం లేదన్నారు.

బ్రహ్మసముద్రం : సమస్యలు పరిష్కరించాలని సచివాలయ సర్వేయర్లు తహసీల్దార్‌కు వినతి పత్రం అందించారు. సోమవారం తహసీల్దార్ ఆర్.సుమతి, ఎంపీడీఓ రంగనాయకులకు గ్రామ సచివాలయ సర్వేయర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందించారు. నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలియజేశారు.

కౌలు రైతుల సమస్యలు పరిష్కరించండి



వజ్రకరూరులో తహసీల్దార్ నరేష్‌కుమార్‌కు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

వజ్రకరూరు: కడమలకుంట గ్రామంలో కౌలు రైతుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఏపీ కౌలు రైతు సంఘం నాయకులు కోరారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఏపీ కౌలు రైతు సంఘం నాయకులు, కడమలకుంట కౌలు రైతులు తహసీల్దార్ నరేష్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ఏపీ కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు రంగారెడ్డి, బాలరంగయ్య, నియోజకవర్గ కౌలురైతు సంఘం కార్యదర్శి వెంకటేశులు, మండల నాయకులు సుంకన్న, సురేంద్ర,నాగ ప్ప, రాందాస్, ఎర్రిస్వామి, రామాంజనమ్మ, కదిరమ్మ, పార్వతి, లలితమ్మ, సుంకమ్మ, వసంతమ్మ, బ్రహ్మయ్య, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ఉపాధ్యాయుడికి సన్మానం



ఉపాధ్యాయుడు జగదీష్‌ను సన్మానిస్తున్న గ్రామస్తులు

బొమ్మనహాళ్: కల్లుదేవనహళ్లి ప్రాథమిక పాఠశాలలో తొమ్మిదేళ్ల పనిచేసి బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయుడు ఎస్. జగదీష్‌బాబును గ్రామస్తులు, విద్యార్థులు ఘనంగా సన్మానించారు. గ్రామస్తులు మాట్లాడుతూ ఉపాధ్యాయుడు జగదీష్‌బాబు అందరితోనూ కలుపుగోలుగా ఉంటూ, పిల్లలకు మంచి విద్యనందించారన్నారు. అనంతరం ఉపాధ్యాయుడిని శాలువా కప్పి సన్మానించారు.

తహసీల్దార్ ఓబుళపతి బాధ్యతల స్వీకరణ



విడపనకల్లు: విడపనకల్లు నూతన తహసీల్దార్‌గా దాసరి ఓబుళపతి సోమవారం బాధ్యతలు చేపట్టారు. సాధారణ బదిలీలో భాగంగా గుత్తి నుంచి విడపనకల్లుకు బదిలీపై వచ్చారు. తహసీల్దార్‌కు రెవెన్యూ సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి, శుభాకాంక్షలు తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

బొమ్మనహాళ్: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జంతుశాస్త్రం అతిథి అధ్యాపక పోస్టుకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ హనుమంతునాయక్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 26న అభ్యర్థులు అర్హత పత్రాలతో హాజరుకావాలని ఆయన కోరారు.

రైతులకు విత్తనాలు ఇవ్వండి

విడపనకల్లు: ఖరీఫ్‌లో సాగు చేసే రైతులకు ప్రభుత్వం అందిస్తున్న వేరుశనగ విత్తనాలను పూర్తి స్థాయిలో అందించాలని సీపీఎం నాయకులు రంగారెడ్డి, కౌలు రైతు సంఘం జిల్లా నాయకులు బోయ వెంకటేశులు సోమవారం డిమాండ్ చేశారు. రైతు సేవా కేంద్రాల్లో రైతులకు సరిపడా విత్తనకాయలు అందుబాటులో లేవన్నారు.

జూలై 15లోపు వేరుశనగ విత్తుకోండి

కూడేరు: జూలై 15లోపు వేరుశనగ విత్తుకోవచ్చని ఏఓ శుభకర్ రైతులకు తెలియజేశారు. సోమవారం విత్తన వేరుశనగ కోసం రైతులు ఏఓ కార్యాలయానికి వచ్చారు. ఏఓ వేరుశనగ విత్తన సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. జూన్ 15 నుంచి జూలై 15 లోపు వేరుశనగ విత్తుకోవడానికి అదును అన్నారు. విత్తనం విత్తేటప్పుడు ఎం–45తో విత్తన శుద్ధి చేయాలని, తద్వారా పంటకు తెగుళ్ల ఆశించకుండా అరికట్టొచ్చన్నారు. పొడరైతే క్వింటాకు కేజీ, లిక్విడ్‌యైతే రూ.500 ఎంఎల్ వరకు కలిపి శుద్ధి చేయాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

వజ్రకరూరు: మండలంలోని పందికుంట గ్రామ సమీపంలో సోమవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. పీసీ కొత్తకోటకు చెందిన శ్రీనివాసులు, జరుట్లరాంపురం కొట్టాలకు చెందిన సామేనాయక్ ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో శ్రీనివాసులు, సామేనాయక్ ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని మెరుగైన చికిత్స నిమిత్తం అనంతపురం ఆసుపత్రికి తరలించారు. ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నాగస్వామి తెలిపారు.

వారం రోజుల్లో పశువుల దాణా పంపిణీ

కుందుర్పి: మండలంలోని పశువులు, గేదెలు ఉన్న రైతులకు వారంరోజుల్లోపు దాణా అందిస్తామని పశువైద్యాధికారి ప్రసాద్ తెలిపారు. 320 క్వింటాళ్ల దానా కోసం ఇండెడ్ పంపామని, వచ్చే వారంలో రైతులు 50 శాతం సబ్సిడీతో దానా అందిస్తామన్నారు. వర్షాలు పడుతున్న తరుణంలో ముందు జాగ్రత్త చర్యగా జీవాలకు డీవార్మింగ్ అందిస్తున్నామన్నారు.

సబ్సిడీతో చిరుధాన్యాల పంపిణీ

కుందుర్పి: ఖరీఫ్ సీజన్‌లో పంటలు సాగు చేసే రైతులకు సబ్సిడీతో చిరు ధాన్యాల విత్తనాలు పంపిణీ చేయనున్నట్లు కుసుమగిరి రైతు సహకార సంఘం సీఈఓ నరసింహమూర్తి, డైరెక్టర్ లక్ష్మీపతి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు.

ఘనంగా బొమ్మలింగేశ్వర స్వామి ఉత్సవం



ప్రత్యేక అలంకరణలో బొమ్మలింగేశ్వరస్వామి

కుందుర్పి: మండలంలోని బెస్తరపల్లి బొమ్మలింగేశ్వర స్వామి ఉత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి పాలాభిషేకం, కుంకుమార్చన, గ్రామోత్సవం, అంకురార్పణం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారికి తమలపాకుల పూజ, నెయ్యాభిషేకం చేశారు. బొమ్మలనాయుడు ఆలయం, మండల మల్లప్ప ఆలయంలోనే ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు.

ఆలయ స్థలాన్ని పరిరక్షించాలని వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

ఉరవకొండ రూరల్: పట్టణంలోని వెంకటేశ్వర స్వామి ఆలయానికి చెందిన స్థలం ఆక్రమణకు గురైందని, దాన్ని సంరక్షించాలని ఆలయ కమిటీ సభ్యులు తహసీల్దార్ మహబూబ్ బాషాకు సోమవారం వినతి పత్రం అందించారు. ఆలయానికి చెందిన దక్షిణ దిశలో 6 అడుగుల స్థలాన్ని చౌడేశ్వరి కాలనీకి చెందిన పుల్లా రాజశేఖర్ ఆక్రమించి, నీటి సంపు నిర్మిస్తున్నాడని ఫిర్యాదులో తెలిపారు.

వేలాడుతున్న మృత్యు తీగలు



బీటీపీ రోడ్డులో చేతికందే ఎత్తులో వేలాడుతున్న ప్రధాన విద్యుత్ తీగలు

రాయదుర్గంటౌన్: నిత్యం వందలాది వాహనాల రాకపోకలు సాగించే బీటీపీ రోడ్డులో విద్యుత్ తీగలు ప్రమాదకరంగా ఉన్నాయి. చేతికందే ఎత్తులో వేలాడుతున్నాయి. ఈ మార్గంలో రోజూ వాహనాల రద్దీ అధికంగా ఉంటుంది. ప్రధాన విద్యుత్ తీగలు చాలా కాలంగా వేలాడుతున్నాయి. నిత్యం ప్యాసింజర్ ఆటోలు పదుల సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటాయి. ప్రమాదాలు జరగక ముందే విద్యుత్ తీగలు మరమ్మతు చేయాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.

ఎమ్మార్పీకే మద్యం విక్రయించాలి

- ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య



మద్యం దుకాణంలో తనిఖీలు చేస్తున్న డీసీ నాగమద్దయ్య, సిబ్బంది

రాయదుర్గం: ప్రైవేట్ మద్యం దుకాణాల్లో నిబంధనల మేరకు ఎమ్మార్పీకే విక్రయించాలని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య సూచించారు. సోమవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏఈఎస్ శ్రీరామ్, స్థానిక సీఐ మహేష్‌కుమార్‌తో కలసి పట్టణంలోని పలు మద్యం దుకాణాల్లో తనిఖీలు చేశారు. అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌లో రికార్డులు పరిశీలించారు. సీఐ మహేష్‌కుమార్‌తో నవోదయం 2.0, కర్ణాటక మద్యం అక్రమ రవాణా, పీడీ యాక్ట్ నమోదుపై అడిగి తెలుసుకున్నారు. బెల్టు షాపులు నిర్మూలనతో పాటు కర్ణాటక మద్యం ఎట్టిపరిస్థితుల్లో ఏపీలోకి దిగుమతి కాకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అనంతరం కర్ణాటక సరిహద్దులోని డి హీరేహాళ్ మండలం ఓబుళాపురం వద్ద ఎక్సైజ్ చెక్‌పోస్టును ఆకస్మికంగా తనిఖీ చేశారు.

పదోన్నతులు కల్పించిన తర్వాత బదిలీలు చేయండి



కళ్యాణదుర్గంలో నిరసన తెలుపుతున్న సచివాలయ ఉద్యోగులు

కళ్యాణదుర్గం రూరల్: సమస్యలు పరిష్కరించాలని సచివాలయ ఉద్యోగులు డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని మున్సిపాల్ కార్యాలయం ఎదుట సచివాలయ ఉద్యోగులు నిరసన తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ సీనియార్టీ రోస్టర్ జాబితా మేరకు పదోన్నతి కల్పించిన తర్వాతే ట్రాన్స్‌ఫర్స్ చేసేవిధంగా చూడాలని కోరారు. జీవో 532ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం సచివాలయ ఉద్యోగులు మున్సిపాల్ కమిషనర్ వంశీకి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు గణేష్, ఉపేంద్ర, నవీన్‌రెడ్డి, దివ్య శిల్ప, నల్లప్ప, నీలిమ, కృష్ణయ్య, దివాకర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలందుకున్న పార్వతీ పరమేశ్వరుడు

కూడేరు: కూడేరులో పార్వతి పరమేశ్వర జోడు లింగాల సంగమేశ్వర ఆలయంలో శివపార్వతులు సోమవారం ప్రత్యేక పూజలు అందుకున్నారు. పురోహితులు శివశంకర్ శాస్త్రి, అర్చకులు మహేష్ పాలాభిషేకం, రుద్రాభిషేకం చేశారు. వివిధ రకాల పుష్పాలతో విశేషంగా అలంకరించి, భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు.